ఏసీటీఓలకు సన్మానం



ఏసీటీఓలు ఇర్ఫాన్ అలీ, నాగరాజును సన్మానిస్తున్న అజిత్ ఇందుజ

అఫ్జల్‌గంజ్: వాణిజ్య పన్నుల శాఖలో ఏసీటీఓలుగా పనిచేసిన ఇర్ఫాన్ అలీ, నాగరాజు పదవీ విరమణ పొందడంతో ఆర్టీఏ యాక్టివిటీస్ అజిత్ ఇందుజ ఘనంగా సత్కరించారు. శుక్రవారం వారిని సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా అజిత్ ఇందుజ మాట్లాడుతూ..30 ఏళ్లకు పైగా వాణిజ్య పన్నుల శాఖలో విధులు నిర్వహించిన వారి సేవలు అమోఘమని కొనియాడారు.

అన్నదానం



డబీర్‌పురా: భారత నవయుగ సమాజం ఆధ్వర్యంలో కోమటివాడిలోని పోచమ్మ ఆలయంలో శుక్రవారం రాత్రి లక్ష్మీ పూజ, గంట హారతి తదితర పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సమాజం ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ కుమార్‌కు ఎక్సలెన్సీ అవార్డు



అవార్డు అందజేస్తున్న డాక్టర్ రాజ్‌నారాయణ్ ముదిరాజ్

అబిడ్స్: జాతీయ విజ్ఞాన దినోత్సవం సందర్భంగా ఓయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగారంకు సర్ సీవీ రామన్ ఎక్సలెన్సీ-2025 అవార్డును తెలంగాణ మేధావుల ఫోరం అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో అందజేశారు. శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవంలో భాగంగా ఆయనను సత్కారం చేసి అవార్డును బహూకరించారు. ఈ సందర్భంగా రాజ్‌నారాయణ్ ముదిరాజ్ మాట్లాడుతూ..ప్రొఫెసర్ కుమార్ మొలుగారం విద్యారంగ వ్యాప్తికి చేసిన కృషి అమోఘమన్నారు. అనంతరం కుమార్ మాట్లాడుతూ.. అవార్డును అందుకోవడం ఆనందంగా ఉందన్నారు.

మేరు కులస్తులను ఆదుకోవాలి



టైలర్స్ డే వేడుకల్లో పోల్కం శ్రీనివాస్

అఫ్జల్‌గంజ్: మేరు కులస్తులను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మేరు యువజన సంఘం అధ్యక్షుడు పోల్కం శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం టైలర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాష్ట్రంలో ఉన్న లక్షలాది మంది మేరు కులస్తులకు వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కుట్టు మిషన్లు ఇవ్వాలన్నారు. గత పార్లమెంటు అంసెబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంలో మేరు కులస్తులు కీలక పాత్ర పోషించారన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిమూలం శంకర్, మాడిశెట్టి సురేష్, నర్సింగ్, ఎ.శ్రీనివాస్, పోల్కం వినయ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలి



సమస్యలు తెలుసుకుంటున్న ఆనంద్‌కుమార్ గౌడ్

అబిడ్స్: నీటి ఎద్దడి నివారణకు వాటర్‌బోర్డు అధికారులు చర్యలు తీసుకోవాలని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు ఆనంద్‌కుమార్ గౌడ్ కోరారు. గోషామహల్ హిందీనగర్ ప్రాంతాల్లో శుక్రవారం ఆయన పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..హిందీనగర్, గోషామహల్, ఎంజే మార్కెట్ చాక్నవాడి, ఆగాపురా, రజక్‌పురా తదితర ప్రాంతాల్లో నీటి ఎద్దడి అధికంగా ఉందన్నారు. ప్రజలకు నీటి సమస్యలు తలెత్తకుండా చూసే బాధ్యత వాటర్‌బోర్డు అధికారులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రియాగుప్తా, విజయ్ ముదిరాజ్, శ్రీధర్, బస్తీవాసులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

చార్మినార్: విద్యాభ్యాసంతో పాటు శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఇతర అంశాలపై కూడా విద్యార్థులు దృష్టిసారించాలని ఇస్రో శాస్త్రవేత్త డా.సి.సుధాకర్ రెడ్డి అన్నారు. సిటీ కళాశాల సైన్స్ విభాగాల ఆధ్వర్యంలో తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్స్ వారి సౌజన్యంతో జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా జరిగింది. డ్రాయింగ్, పెయింటింగ్, వ్యాసరచన, క్విజ్, పోస్టర్ ప్రెజెంటేషన్, సైంటిఫిక్ మోడల్ ప్రదర్శన పోటీలలో వివిధ పాఠశాలల, కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డి జీవవైవిధ్య అధ్యయనంపై, ఇస్రో శాస్త్రీయ ప్రయోగాలపై అవగాహన కల్పించారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. సీనియర్ శాస్త్రవేత్త ఆచార్య.సి. మనోహరాచారి, తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్స్ ట్రెజరర్ ఆచార్య. ఎం.ఎస్.రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డా.విప్లవ దత్ శుక్లా, సీనియర్ అధ్యాపకులు డాక్టర్ యాదయ్య, డాక్టర్ నైన వినోదిని, డా.పర్వతాలు, డా.వాసుదేవ రెడ్డి, రతన్ కుమార్ పాల్గొన్నారు.

విజయనగర్‌కాలనీలో..

విజయనగర్‌కాలనీ: విజయనగర్‌కాలనీ నారాయణ ఈ టెక్నో పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన సైన్స్ ప్రదర్శనశాలను ప్రముఖ వైద్యులు డాక్టర్ ఎస్.శారద దేవి, డాక్టర్ జి.భానుప్రసాద్ ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు. గోపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాల్ గంగాకిరణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విజయనగర్‌కాలనీ నారాయణ ఈ టెక్నో స్కూల్‌లో..

సుల్తాన్‌షాహిలో..

యాకుత్‌పురా: సుల్తాన్‌షాహిలోని ప్రభుత్వ శాలిబండ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వైజ్ఞానానికి ప్రదర్శనాను విద్యాశాఖ బహదూర్‌పురా మండల డిప్యూటీ ఐఓఎస్ హరినారాయణ తిలకించి విద్యార్థులను అభినందించారు. ఉపాధ్యాయులు శ్రీదేవి, మంజుల, అనురూద్‌రావు, రాధాకృష్ణ, ప్రధానోపాధాయురాలు బబిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ప్రదర్శన ప్రారంభించిన ప్రిన్సిపాల్ మిథిలేష్ కుమార్



శాలిబండ బాలికల ఉన్నత పాఠశాలలో..

రహింపురాలో..

అబిడ్స్: ధూల్‌పేట రహింపురా ఎస్ఎస్‌కే సమాజ్ పాఠశాలలో సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. శుక్రవారం మంగళ్‌హాట్ కార్పొరేటర్ శశికళ కృష్ణ ప్రారంభించి ఎగ్జిబిషన్‌ను తిలకించారు. హెచ్.కుమార్, నర్సింగ్‌రావు, జ్యోతి, ప్రభు శహా, నగరి మధుసూధన్, డాక్టర్ విజయ్‌భాస్కర్, అంజలి, ప్రమిల, సంధ్య, నవనీత పాల్గొన్నారు.



ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న కార్పొరేటర్ శశికళ కృష్ణ

దోర్‌బస్తీలో..

జియాగూడ: సీవీ రామన్ శాస్త్రవేత్తగా ఎన్నో ప్రయోగాలు చేసి విజయం సాధించాడని ఇంద్రాణి మహా విద్యాలయ ప్రిన్సిపాల్ మిథిలేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం దోర్‌బస్తీలోని ఐఎంఎస్ సావిష్కార్ సైన్స్ ప్రదర్శన ఏర్పాటైంది. ఈ సందర్భంగా విద్యార్థులు సైన్స్ సబ్జెక్ట్ నుంచి ఎన్నో ప్రయోగాలను తీసుకొని ప్రదర్శనలో ఉంచి వివరించారు. హెచ్‌ఓడీ ఇంద్రాణి, ఇన్‌చార్జి శ్వేత, శిరీష్, మీనాక్షి, సరిత, మహేశ్వరి, అశ్విని, హేమలత, రాధిక, ప్రియాన్షు పాల్గొన్నారు.



సిటీ కాలేజిలో ప్రశంసాపత్రాలు పొందిన విద్యార్థులు

రేపు ఎల్బీస్టేడియంలో భక్త రామదాస్ జయంత్యుత్సవాలు



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న అలేఖ్య పుంజాల

గన్‌ఫౌండ్రీ: మార్చి 2న ఎల్బీ స్టేడియంలో తెలంగాణ సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో సుప్రసిద్ధ భక్త రామదాస్ జయంత్యుత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలంగాణ సంగీత నాటక అకాడమీ చైర్మన్ డాక్టర్ అలేఖ్య పుంజాల తెలిపారు. శుక్రవారం కళా భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. తెలంగాణను ఆధ్యాత్మిక రంగంలోనూ తీర్చిదిద్దేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. ప్రతి యేటా తమిళనాడులో నిర్వహించే త్యాగరాజ ఆరాధనోత్సవాల మాదిరిగానే ఇకపై ప్రతి యేటా తెలంగాణలో భక్తరామదాస్ జయంత్యుత్సవాలు నిర్వహించబడతాయని ప్రకటించారు. ఈ ఉత్సవాలకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, సీతక్కలతో పాటు పలువురు ప్రముఖులు హాజరవుతారని తెలిపారు. అదేవిధంగా పద్మశ్రీ పురస్కార గ్రహీతలు డాక్టర్ ఎల్లా వెంకటేశ్వర్‌రావు, డాక్టర్ శోభారాజు, హైదరాబాద్ బ్రదర్స్, హైదరాబాద్ సిస్టర్స్‌లతో పాటు వివిధ విభాగాలకు చెందిన విద్వాంసులు హాజరవుతారని పేర్కొన్నారు. అన్ని జిల్లాల నుంచి 26 సంగీత గాన బృందాలు, 600 మందికి పైగా సంగీత కళాకారులు ఈ ఉత్సవాల్లో పాల్గొంటారని వెల్లడించారు. సమావేశంలో బి.మనోహర్, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు



టార్చ్‌ను వెలిగించి పోటీలను ప్రారంభిస్తున్న రాఘవరెడ్డి

గోల్కొండ: జాతీయ స్థాయి క్రీడలకు తమ కళాశాల వేదిక కావడం కళాశాలకే గర్వ కారణమని షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ జి.రాఘవరెడ్డి అన్నారు. 11వ జాతీయ ఇంటర్ ఇంజినీరింగ్ కళాశాలల వెర్వ్ 2025 క్రీడా పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను ఆయన టార్చ్ వెలిగించి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..విద్యాబోధనలోనే కాకుండా వివిధ క్రీడలకు తమ కళాశాల అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని, అందువల్లే ఈసారి జాతీయ పోటీలకు తమ కళాశాల ఎంపికైందన్నారు. వాలీబాల్, చెస్, ఖోఖో, త్రోబాల్ లాంటి క్రీడా అంశాల్లో పోటాపోటీగా క్రీడలు జరుగుతాయని ఆయన అన్నారు. ఈ పోటీల్లో మొత్తం 20 కళాశాలలకు చెందిన క్రీడాకారిణిలు పాల్గొంటున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్‌పర్సన్ జి.శ్రీవిద్యారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రమేష్‌రెడ్డి, డాక్టర్ అపర్ణపల్లే, కన్వీనర్ డాక్టర్ ఎంవీఎల్ సూర్యకుమారి తదితరులున్నారు.

రేపు గుజరాతీ పాఠశాలలో మహిళా దినోత్సవం

సుల్తాన్‌బజార్: లవ్ ఫర్ కౌ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళా శక్తి మహా కుంబ్, మహిళా దినోత్సవ వేడుకలను సికింద్రాబాద్‌లోని గుజరాతీ పాఠశాలలో మార్చి 2న నిర్వహిస్తున్నట్లు లవ్ ఫర్ కౌవ్ చైర్మన్ జస్మత్ పటేల్ తెలిపారు. శుక్రవారం హైదర్‌గూడ ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..రాబోయే మహిళా దినోత్సవం సందర్భంగా వివిధ రంగాలలో సేవలందిస్తున్న మహిళలకు గో సేవా, సనాతన సేవా, ఆరోగ్య సేవా మొదలైన రంగాల్లో పనిచేస్తున్న మహిళలను గోరత్న, మహిళా రత్న, వైద్య రత్న, సమాజ రత్న అవార్డు ప్రదానం చేస్తామన్నారు. జంట నగరాలలోని అన్ని మహిళా సంస్థలు, సుందర్ కంద్ మండల్, రామాయణ మండల్, జాగరణ్ మండల్, కిట్టి ప్రాపర్టీ గ్రూప్ సంస్థలను ఆహ్వానించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఆర్‌కె.జైన్, రిదేష్ జాగిర్దార్, జైన్ రత్న మీనా ముఖర్జీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జస్మత్ పటేల్

త్వరలో ఉద్యోగుల మహా సభ నిర్వహిస్తాం



డైరీ ఆవిష్కరణ చేస్తున్న జగదీశ్వర్, రవీంద్రనాయక్ తదితరులు

సుల్తాన్‌బజార్: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై త్వరలో ఉద్యోగుల మహా సభ నిర్వహిస్తామని టీఎన్జీఓస్ సెంట్రల్ యూనియన్ అధ్యక్షుడు మారం జగదీశ్వర్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం కోఠిలోని డీఎంహెచ్ఎస్ ఆడిటోరియంలో టీఎన్జీఓస్ తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ సెంట్రల్ ఫోరం 2025 డైరీ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జగదీశ్వర్, డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ రవీంద్రనాయక్, తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్‌లు హాజరై డైరీ, కేలండర్‌ను ఆవిష్కరించారు సెంట్రల్ ఫోరం అధ్యక్షుడు కిరణ్‌రెడ్డి, టీఎన్జీఓస్ సెంట్రల్ యూనియన్ నాయకులు కస్తూరి వెంకటేశ్వర్లు, శ్రీకాంత్, శ్రీనివాస్, వెంకటేష్, రవి ప్రకాష్, శంకర్‌రెడ్డి, శైలజ, హరినాథ్ గౌడ్, రజేందర్, నర్సింహారెడ్డి, వెంకట్‌రామిరెడ్డి పాల్గొన్నారు.

ప్లాస్టిక్ గోడౌన్‌లో అగ్నిప్రమాదం



చాంద్రాయణగుట్ట: ఓ ప్లాస్టిక్ గోడౌన్‌లో ప్రమాదవశాత్తు శుక్రవారం సాయంత్రం అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ఘటన బండ్లగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, గోడౌన్ నిర్వాహకులు తెలిపిన వివరాల ప్రకారం..గౌస్‌నగర్ లేక్‌వ్యూ హిల్స్‌లో మహ్మద్ సికిందర్ ఏడేళ్లుగా ప్లాస్టిక్ కంపెనీ నిర్వహిస్తున్నాడు. శుక్రవారం కంపెనీకి సెలవు ఉండటంతో పనివాళ్లు కూడా రాలేదు. సాయంత్రం 4 గంటల సమయంలో ప్లాస్టిక్ గోడౌన్‌లో ఒక్కసారి మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న బండ్లగూడ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. అనంతరం ఫైరింజన్‌ను రప్పించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఇదిలా ఉండగా కంపెనీ నిర్వాహకుడు మహ్మద్ సికిందర్ మాత్రం అగ్ని ప్రమాదంపై అనుమానం వ్యక్తం చేశాడు. ఎవరో కావాలని నిప్పంటించి ఉంటారని..ఈ ఘటనలో దాదాపు రూ.10 లక్షల వరకు ఆస్తినష్టం జరిగినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆకట్టుకున్న 'ప్రతీగ్యా' మృదంగం



నాంపల్లి: కేంద్ర సంగీత నాటక అకాడమీ–న్యూ ఢిల్లీ, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం సంయుక్తంగా శుక్రవారం పబ్లిక్‌గార్డెన్స్‌లోని నందమూరి తారక రామారావు కళా మందిరంలో కళలను విస్తృతం చేయడంలో భాగంగా కేంద్రం ప్రవేశపెట్టిన 'ప్రతీగ్యా'పథకం కింద పద్మశ్రీ డాక్టర్ ఎల్లా.వెంకటేశ్వరరావు బృందం ప్రదర్శించిన మృదంగ ప్రదర్శన ఆకట్టుకుంది. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానంద రావు, రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు, సంస్కృతి, పర్యాటక విభాగం అధిపతి డాక్టర్ వనజా ఉదయ్ హాజరై కళాకారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సంగీత నాటక అకాడమీ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ ఎస్పీ భారతి, సంగీత నాటక అకాడమీ ప్రతినిధి దీపక్ జోషీ, నాట్యాచార్యులు భాగవతుల సేతరాం, సంగీత విద్వాంసులు వైజర్సు బాలసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

సైకిళ్ల పంపిణీ



సైకిళ్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: ఆధ్యాత్మికతతో పిల్లల్లో సత్ప్రవర్తన అలవరుతుందని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. శుక్రవారం ఆయన హకీంపేట్‌లో సున్నత్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వంద మంది పిల్లలకు సైకిళ్లను పంపిణీ చేశారు. సున్నత్ వెల్ఫేర్ సొసైటీ వారు వంద రోజులు విరామం లేకుండా ప్రతినిత్యం ఐదుసార్లు నమాజ్ ఆచరించే వారికి ఈ సైకిళ్లను అందించడం గొప్ప విషయమన్నారు. పిల్లలపై వంద రోజుల పాటు పర్యవేక్షణ ఉంచిన ఏక్‌మినార్ మసీదు నిర్వాహకులకు ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, గౌస్ భాయ్, సలామ్ ఖాలేదీ తదితరులున్నారు.

ప్రభుత్వ పాఠశాల స్థలాన్ని పరిశీలించిన అధికారులు

విజయనగర్‌కాలనీ: విజయనగర్‌కాలనీలో మూతపడిన ప్రభుత ఉన్నత పాఠశాల స్థలాన్ని అన్యాక్రాంతం చేసుకునేందుకు కొందరు ప్రయత్నచేస్తున్నారని సమాచారం అందుకున్న విద్యాశాఖ అధికారులు శుక్రవారం పాఠశాలను పరిశీలించారు. ఇటీవల కొందరు పాఠశాలకు తాళాలు వేసి బ్యానర్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన విషయాన్ని స్థానికులు ఆసిఫ్‌నగర్ డిప్యూటీ డీఈఓ రమణరాజుకు వివరించారు. దాదాపు అర్ధ శతాబ్దం కిందట ప్రజల విజ్ఞప్తి మేరకు ప్రభుత్వ ఆధ్వర్యంలోని హౌసింగ్ బోర్డు ఈ భవనాన్ని పాఠశాలకు కేటాయించిందని విజయనగర్‌కాలనీ సంక్షేమ సంఘం కార్యదర్శి జి.అమరేందర్‌రెడ్డితో పాటు కాలనీవాసులు వివరించారు. సరైన పత్రాలు లేకుండా ఈ స్థలం తమదేనంటూ గేటుకు ఉన్న తాళాన్ని పగలగొట్టి బ్యానర్లు తెచ్చి పాఠశాల గోడలకు పెట్టారని పేర్కొన్నారు. స్థలాన్ని పరిశీలించామని, నివేదికను రూపొందించి ఉన్నతాధికారులకు అందజేస్తామని డిప్యూటీ డీఈఓ రమణరాజు తెలిపారు.

బాధ్యతాయుత ఇంధన వినియోగాన్ని ప్రోత్సహించాలి

సాక్షి సిటీబ్యూరో: బాధ్యతాయుత ఇంధన వినియోగాన్ని ప్రోత్సహించాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ పీఎస్ఎన్వీ ప్రసాద్ అన్నారు. ఇంధన సంరక్షణపై అవగాహన పెంచేందుకు నిర్వహించే వార్షిక సంరక్షణ సామర్థ్య మహోత్సవం శుక్రవారం ముగిసింది. నాంపల్లి, తెలుగు విశ్వవిద్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ..స్వచ్ఛమైన స్థిరమైన ఇంధన వినియోగం సంరక్షణ బాధ్యతను గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొని మాట్లాడారు.

ప్రశాంతంగా సామూహిక ప్రార్థనలు



శాలిబండ: మక్కా మసీదులో శుక్రవారం సామూహిక ప్రార్థనలు ప్రశాంతంగా ముగిశాయి. ఈ ప్రార్థనల్లో మాజీ కార్పొరేటర్ మోసిన్ బలాలతో పాటు ముస్లింలు పెద్ద ఎత్తు పాల్గొన్నారు. శుక్రవారం సందర్భంగా దక్షిణ మండలం పోలీసుల ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

క్రమశిక్షణతో కూడిన విధి నిర్వహణ అవసరం



మాట్లాడుతున్న జోనల్ కమిషనర్ వెంకన్న

చార్మినార్: ప్రభుత్వ ఉద్యోగులు క్రమశిక్షణతో కూడిన విధి నిర్వహణ సత్ఫలితాలు ఇవ్వడమే కాకుండా తోటి ఉద్యోగులకు మార్గదర్శకులుగా నిలుస్తారని జీహెచ్ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ వెంకన్న అన్నారు. చార్మినార్ జోన్ జాయింట్ కమిషనర్ శైలజ పదవీ విరమణ సందర్భంగా జోనల్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ వెంకన్నతో పాటు జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ యాదగిరిరావు, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్లు, పలు విభాగాల అధికారులు జాయింట్ కమిషనర్ శైలజ, శ్రీనివాస్‌రావు దంపతులను సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం శైలజ మాట్లాడుతూ...విధి నిర్వహణలో సహకరించిన అధికారులు, ఉద్యోగులందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ మహేశ్వర్‌రెడ్డి, పాతబస్తీ సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్‌లు మంగతయారు, సురేందర్, సరిత, అరుణ కుమారి, రవి కుమార్, టౌన్ ప్లానింగ్ సీపీ మహమ్మద్ అబ్దుల్ మాజీద్ ఆమెకు వీడ్కోలు పలికారు.

ప్రత్యేక పూజలు



గోల్కొండ కోటలో..



రుద్రాభిషేకం నిర్వహిస్తున్న భక్తులు

గౌలిపురా: వాసవి అన్నపూర్ణ సేవా సంస్థ లాల్‌దర్వాజా గౌలిపురా ఆధ్వర్యంలో ప్రతి నెల అమావాస్య సందర్భంగా నిర్వహించే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గౌలిపురా బతుకమ్మ బావి వద్ద గల లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో పరమ శివునికి ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. హైదరాబాద్ వైశ్య యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు మాడిశెట్టి నరేశ్, కోశాధికారి సరాబు ఉదయ్ భాస్కర్, సంస్థ అధ్యక్షులు శ్రీరాం కోటయ్య గుప్తా, ప్రధాన కార్యదర్శి శ్రీధర మల్లికార్జున్ గుప్తా, కోశాధికారి ఇరుకుల్ల భిక్షపతి, సలహాదారులు ఇరుకుల్ల నరసింహులు గుప్తా, ఉపాధ్యక్షులు గుబ్బ శ్రీనివాస్ గుప్తా, బెజగం చంద్ర మోహన్ పాల్గొన్నారు.

గోల్కొండ: అమావాస్యను పురస్కరించుకిని శుక్రవారం వివిధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. గుడిమల్కాపూర్, టోలిచౌకీ చౌరస్తా, గోల్కొండ తదితర ప్రాంతాల్లోని ఆలయాల్లో పెద్ద ఎత్తున భక్తులు పూజలకు హాజరయ్యారు. గోల్కొండ కోటలోని మహంకాళీ అమ్మవారి ఆలయంలో పూజారి బి.సురేష్‌చారి పూజలు చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్, కార్పొరేటర్లు

యాకుత్‌పురా: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ తెలిపారు. నియోజకవర్గంలోని రెయిన్ బజార్, తలాబ్ చంచలం, మొఘల్‌పురా, పత్తర్‌గట్టి డివిజన్లలో చేపట్టానున్న అభివృద్ధి పనులకు శుక్రవారం ఆయన కార్పొరేటర్లతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్ల సమస్యలను పరిష్కారించేందుకు నూతన అభివృద్ధి పనులను చేపట్టానున్నమన్నారు. ఈ కార్యక్రమంలో మజ్లిస్ పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి యాసర్ అరాఫత్, కార్పొరేటర్లు సయ్యద్ సోహెల్ ఖాద్రీ, నస్రీన్ సుల్తానా, మహ్మద్ వసీవుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యం

మేయర్ గద్వాల్ విజయలక్ష్మి



లైట్ హౌస్‌ను ప్రారంభిస్తున్న గద్వాల్ విజయలక్ష్మి

నాంపల్లి: యువతకు మెరుగైన నైపుణ్యాన్ని పెంపొందించి తద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యమని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం మల్లేపల్లి బడే మసీదు సమీపంలో లైట్ హౌస్ సెంటర్‌ను ఆమె డిప్యూటీ మేయర్ శ్రీలతాశోభన్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ..గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, లైట్ హౌస్ కమ్యూనిటీస్ ఫౌండేషన్(ఎల్‌సీఎఫ్) భాగస్వామ్యంతో నగర యువతకు నైపుణ్యం, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. జీహెచ్ఎంసీ అంటే పారిశుద్ధ్య నిర్వహణను మాత్రమే చూస్తుందని ప్రజలు అనుకుంటారని, కానీ జీహెచ్ఎంసీ మరో కోణంలో ముందడుగు వేసి యువతకు ఉపాధి కల్పిస్తోందని చెప్పారు. 2023లో చందానగర్‌లో ప్రారంభమైన లైట్‌హౌస్ ప్రోగ్రామ్ ద్వారా ఇప్పటి వరకు 1300 మందికి పైగా యువత వివిధ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకున్నారని, అందులో 500 మందికి పైగా యువత ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలతో, స్వయం ఉపాధి ద్వారా ఆదాయాన్ని పొందుతున్నారని తెలిపారు. యూబీఎస్ సంస్థ తన కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ(సీఎస్ఆర్) కార్యకరమంలో భాగంగా జీహెచ్ఎంసీ లైట్‌హౌస్ కేంద్రాల నిర్వహణకు ఆర్థిక మద్దతు అందిస్తోందని పేర్కొన్నారు. మల్లేపల్లి లైట్‌హౌస్ సెంటర్‌లో యువతకు కెరీర్ మార్గదర్శకత్వం, వ్యక్తిత్వ వికాసం కోసం 50 గంటల ఫౌండేషన్ కోర్సు, స్పోకెన్ ఇంగ్లిష్ కోర్సులు, ఐటీ అండ్ డిజిటల్ స్కిల్స్ కోసం టెక్ హబ్ ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీ పార్లర్ అండ్ మేక్ తరగతులు, ఆన్‌లైన్ లెర్నింగ్, కెరీర్ కౌన్సిలింగ్ వంటివి అందుబాటులో ఉన్నాయని వివరించారు. 14–17 ఏళ్ల యువత భవిష్యత్‌కు సిద్ధం కావడానికి వ్యక్తిత్వ వికాసం, కెరీర్ మార్గదర్శకత్వం కల్పించే లైట్‌హౌస్ కిరణ్ కోర్సును మల్లేపల్లి కేంద్రంలో మొదటిసారిగా అందిస్తున్నారని చెప్పారు. డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ.. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, డిప్యూటీ కమిషనర్ సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.